


హైదరాబాద్ వార్త

## 2.25కిలోల డ్రగ్స్ స్వాధీనం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్ చౌహాన్

నేరెడ్‌మెట్ ఆగస్టు 9 ప్రభాతవార్త: డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్వోటి పోలీసులు అరెస్టు చేసిన సంఘటన రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని రాచకొండ పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ పోలీస్ కమీషనర్ డి.ఎస్ చౌహాన్ మాట్లాడుతూ రాజస్థాన్‌కు చెందిన మహేందర్ సింగ్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని రామ్‌నగర్‌లో నివసిస్తున్నాడ. గతంలో వ్యాపారం నిర్వహించిన మహేందర్ సింగ్ కరోనా సమయంలో పూర్తిగా నష్టపోవడంతో గత కొంత సంవత్సరాల నుండి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడని తెలిపారు. ఈ క్రమంలో డ్రగ్స్ అలవాటు పడిన మహేందర్ సింగ్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో డ్రగ్స్‌ను విక్రయించడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల నుండి తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరానికి తీసుకువస్తున్న సమయంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం, ఆదిబట్ల పోలీసులు రామ్‌నగర్‌లోని నివాసంలో తనిఖీలు నిర్వహించగా 2.25కిలోల డ్రగ్స్‌తో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.


# పబ్ నిర్వాహకుల ఇష్టారాజ్యం

- పబ్‌కు వచ్చిన కస్టమర్లపై బౌన్సర్లతో దాడులు
- కొండాపూర్ ఎయిర్‌లైవ్ పబ్ మీద కేసు నమోదు

గచ్చిబౌలి, ఆగస్టు 9 ప్రభాతవార్త : హైదరాబాద్ పబ్‌లు వివాదాలకు కేంద్రబిందువులుగా మారుతున్నాయి. నిత్యం వివాదాలతో పబ్‌లు వార్తల్లో నిలుస్తున్నాయి. ముఖ్యంగా హైటెక్‌సిటీ చుట్టుప్రక్కల పబ్‌లు నిబంధనలను లెక్కచేయకుండా, రోజుకో వివాదంతో నడుస్తున్నాయి. నిబంధనలకు నీళ్లోదులుతున్న పబ్‌లు ప్రైవేటు సెక్యూరిటీ, బౌన్సర్లను పెట్టుకొని పబ్‌కు వస్తున్న సామాన్య ప్రజలు, కస్టమర్ల మీద దాడులు చేస్తున్నారు. కస్టమర్ల మీద పబ్ నిర్వాహకుల దాడులు నగరంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పబ్ నిర్వాహకుల ప్రైవేటు సైన్యం చేస్తున్న దాడులు కొన్ని మాత్రమే వెలుగు చూస్తుండగా, చాలా వరకు మధ్యవర్తిత్వంతో సద్దుమణుగుతున్నాయి. గతంలో గచ్చిబౌలి ఫ్రీజం పబ్, జూబ్లిహిల్స్ అమ్నేసియా, పుడింగ్ మింక్ పబ్, మాదాపూర్ కోమా ఘటనలు మర్చిపోకముందే తాజాగా కొండాపూర్ ఎఎంబి మాల్‌లో ఉన్న ఎయిర్‌లైవ్ పబ్ నిర్వాహకులు సైతం ఇదే తరహాలో రెచ్చిపోయారు. పబ్‌కు వచ్చిన ముగ్గురు వ్యాపార భాగస్వాములను ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేసి గాయపర్చడంతో బాధితులు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించారు. ఈ దాడులపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇన్స్‌పెక్టర్ జేమ్స్‌బాబు కథనం ప్రకారం..

నగరంలోని సికింద్రాబాద్ సీతాఫల్‌మండికి చెందిన ఈ.వేణుగోపాల్‌గౌడ్(30) తన స్నేహితులు, వ్యాపార భాగస్వాములు డి.సాయికుమార్ యాదవ్, టి.శివారెడ్డిలతో మంగళవారం రాత్రి కొండాపూర్ ఏఎంబి మాల్ లోని ఎయిర్‌లైవ్ పబ్‌కు వచ్చారు. తమ వ్యాపారం 2వ వార్షికోత్సవ వేడుకలను స్నేహితులంతా పబ్ లోపల ఘనంగా జరుపుకున్నారు. అనంతరం రాత్రి 11గంటల ప్రాంతంలో వేణుగోపాల్, సాయికుమార్, శివారెడ్డిలు పబ్ నుంచి బయటకు వచ్చారు. కొన్ని నిమిషాల తరువాత తిరిగి పబ్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా, అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. తమను పబ్ లోపలికి అనుమతించాలని, అందుకు అవసరమైన అధిక డబ్బును ఇచ్చేందుకు వేణుగోపాల్ స్నేహితులు సిద్ధమైనా బౌన్సర్లు వినకపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కొద్ది నిమిషాల్లోనే ఎయిర్ లైవ్ పబ్ నిర్వాహకులు, పబ్‌లో ఉన్న మిగిలిన బౌన్సర్లు అక్కడకు చేరుకొని వేణుగోపాల్, అతని స్నేహితులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో పబ్ నిర్వాహకులు, బౌన్సర్లు ఒక్కసారిగా తమవెంట తెచ్చుకున్న ఇనుప రాడ్లు, ఇనుప స్కేళ్లతో వేణుగోపాల్, సాయికుమార్, శివారెడ్డిల మీద దాడికి దిగారు. ఈ దాడిలో బాధితులకు గాయాలయ్యాయి. దాడి సంఘటనను వేణుగోపాల్ తన ఐఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, వెనుక నుంచి వచ్చిన ఓ బౌన్సర్ వేణుగోపాల్ ఫోన్‌ను లాక్కొని పగులగొట్టాడు. దీంతో బాధితులు వెంటనే గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించి ఎయిర్‌లైవ్ పబ్‌లో తమపై జరిగిన దాడిపై పిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు అధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎయిర్‌లైవ్ పబ్ నిర్వాహకులు, బౌన్సర్ల మీద ఐపిసి సెక్షన్ 324,427,ౡడ్విత్ 34ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా పబ్‌కు వచ్చిన కస్టమర్ల మీద నిర్వాహకులు, బౌన్సర్లు రెచ్చిపోయి దాడికి పాల్పడడం వివాదస్పదంగా మారింది. గతంతో సైతం గచ్చిబౌలి పరిధిలోని పలు పబ్‌లలో ఈ తరహా గొడవలు చోటుచేసుకున్నాయి. పబ్‌కు వస్తున్న కస్టమర్ల మీద నగరంలోని పబ్ నిర్వాహకుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. దీనికి తోడు వారాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారే వరకు పబ్‌లు నిర్వహిస్తూ, ప్రశ్నించిన చుట్టుప్రక్కల వారిని బెదిరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ఉచిత యాప్‌లతో ఎలా?





నేరస్థులు ఉచిత మొబైల్ అప్లికేషన్లను ఫోన్ల వినియోగదారులకు, విద్యార్థులకు, సంస్థలకు ఎరగా వేస్తున్నారు. వారు డౌన్‌లోడ్ చేసుకోగానే ఆయా సంస్థలు, వ్యక్తుల డేటాను చోరీ చేస్తున్నారు. ఈ డేటాను ఆయా కంపెనీల ప్రత్యర్థులకు విక్రయిస్తామంటూ బెదిరిస్తున్నారు. వారు డిమాండ్ చేసిన సొమ్మును ఇచ్చాకే మాల్‌వేర్, రాన్సమ్ వేర్‌లను తొలగిస్తున్నారు. ప్రముఖ కంపెనీలు, బహుళజాతి సంస్థల అధికారిక మెయిల్ ఖాతాలను హ్యాక్ చేసి, వారి వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నారు. బ్యాంకు ఖాతాలు మార్చామంటూ సంస్థల వినియోగదారులకు మెయిల్ చేసి రూ.లక్షల్లో కొల్లగొడుతున్నారు.

- ఆలోచించకపోతే నష్టపోతాం
- పొంచివున్న ఉచిత యాప్‌లు
- ఉచితంగా వస్తున్నాయని యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నారా?
- అయితే జాగ్రత్త పడాల్సిందే
- ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ గ్రూప్‌లకు వల



హైదరాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త : మొబైల్ యాప్ ఉంటే చాలు. బిర్యానీ, సినిమా టిక్కెట్లు, కూరగాయలు, పప్పులు.. ఇలా అన్నీ ఇంటికి వస్తున్నాయి. బిర్యానీ కావాలంటే హోటల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. సినిమా టిక్కెట్లు తీసుకోవాలంటే థియేటర్‌కు వెళ్లి ముందుగా తీసుకునే అవసరం లేదు. మొబైల్ యాప్‌లు ఉపయోగిస్తున్న వారంతా సమయాన్ని, సౌకర్యాలను అందిస్తున్నాయని అనుకుంటున్నారు. అయితే అప్లికేషన్లతో సౌకర్యంతో పాటు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఉచితంగా వస్తున్నాయని ఎడాపెడా యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నారా? అయితే జాగ్రత్త పడాల్సిందే. ఉచితమంటూ ప్రచారం చేస్తూ వాటిని డౌన్‌లోడ్ చేసుకోగానే ఆయా ఫోన్ల యజమానుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తూ.. అనంతరం బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారని సైబర్ క్రైమ్ అధికారులు చెబుతున్నారు. ఉచితంగా వచ్చే మొబైల్ అప్లికేషన్లను వినియోగించడమంటే ప్రమాదం వెంట ప్రయాణించడమే. ఇంటర్నెట్ లేకుండా పనిచేస్తుందంటూ ప్రచారం నిర్వహిస్తున్న కొన్ని కంపెనీలు, ఫేస్‌బుక్, ట్విటర్ల ద్వారా ఫలానా కంపెనీల ఉత్పత్తులు ఉచితంగా తీసుకొండి అంటూ ఈ-మెయిల్స్‌కు సందేశాలు పంపుతున్న సంస్థల్లో చాలా వరకు నేరపూరితమైనవే. వీటిని డౌన్‌లోడ్ చేసుకున్న వారి వివరాలను సైబర్ నేరస్థులు సేకరిస్తున్నారు. వీటిల్లో సంస్థలుంటే ఆయా సంస్థల అధికారిక రహస్యాలను దొంగిలించి, వాటిని బహిర్గతం చేస్తామంటూ బెదిరించి డబ్బులు వసూలు చేయడం, వ్యక్తులైతే ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారరని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులకు చెబితే ఎక్కడ పరువుపోతుందన్న భావనతో చాలా మంది బాధితులు ఫిర్యాదులు చేయడానికి ముందుకు రావడంలేదు.

**ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ గ్రూప్‌లకు వల..** అర్జంటుగా డబ్బులు కావాలంటూ మీ ఫ్రెండ్ ఫొటో ఉన్న వాట్సాప్ నెంబర్ నుంచి మెసేజ్ వచ్చిందా? దానికి స్పందించే ముందు ఒకసారి చెక్ చేసుకోండి. ఆ మెసేజ్ పంపింది నిజంగా మీ ఫ్రెండేనా కాదాని చూసుకోండి. ప్రొఫైల్ పిక్ చూసి మా వాడేనన్న నిర్ధారణకు రాకండి. ఇటీవల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మోసపోయిన ఉదంతం ఈ జాగ్రత్తలను పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. ఇప్పటి వరకూ ఫేస్‌బుక్ వేదికగా మోసాలు చేస్తున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు రూటు మారుస్తున్నారు. వాట్సాప్‌ను కూడా తమ మోసాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. సాధారణంగా ఫేస్‌బుక్ పేజ్‌లో ఫ్రెండ్స్ లిస్టు ఉంటుంది. వాటి లింక్‌ను క్లిక్ చేస్తే వారి ప్రొఫైల్స్ ఓపెన్ అవుతాయి.ప్రొఫైల్ పిక్స్ కాపీ చేసి వారి పేరుపై ఫేక్ అకౌంట్ ఓపెన్ చేసి అర్జెంట్‌గా డబ్బులు కావాలంటూ మెసేజ్‌లు చేస్తూ డబ్బులు కొట్టేస్తున్న మోసకారుల ఉదంతాలు ఇటీవల చాలానే వెలుగుచూస్తున్నాయి.

## గద్దర్ కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ నేతలు



గద్దర్ నివాసం వద్ద చాడా వెంకట్ రెడ్డి

అల్వాల్, ఆగస్టు 9 ప్రభాతవార్త: స్వర్గీయ గద్దర్ కుటుంబ సభ్యులను బుధవారం సిపిఐ నేతలు పరామర్శించారు. అల్వాల్ భూదేవినగర్‌లోని ప్రజా గాయకుడి నివాసంకు పార్టీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటర్ రెడ్డితో పాటుగా రాష్ట్ర నాయకులు బాలమల్లేష్ ఇతరులు వెళ్లారు. గద్దర్ సతీమణి విమలా గద్దర్ కూతురు వెన్నెలకు తమ ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలు ఉత్తమమైన కళాకారుడిని కోల్పోయారని చాడా వెంకట్ రెడ్డి తెలిపారు.

## యాసిడ్ తాగి ప్రభుత్వ ఉద్యోగి మృతి

మైలార్‌దేవ్‌పల్లి,ఆగష్టు 9 ప్రభాతవార్త : మద్యం అనుకుని తాగిన మైకంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి యాసిడ్ తాగి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. కిస్మత్‌పుర ప్రాంతానికి చెందిన బి.అర్జున్ (56) ప్రభుత్వ ఉద్యోగి. అర్జున్ మంగళవారం రాత్రి తాగిన మైకంలో పొరపాటున మద్యం అనుకుని ఇంట్లోని యాసిడ్ తాగాడు. కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్జున్ మృతి చెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అర్జున్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అర్జున్‌కు భార్య, ము గ్గురు కుమార్తెలు కలరు.కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

మలక్‌పేట, ఆగస్టు 9 ప్రభాతవార్త : మలక్‌పేట పోలీస్ స్టేషన్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు తెలిప ప్రకారం ఇలా ఉన్నాయి. సోలంకి విజయ్ (26) అతని భార్య సోలంకి విజయభవాని, వారి కుమారుడు లక్కి, అతని అన రాజుతో కలిసి మూసారాంబాగ్ డివిజన్ లోని తీగలగూడలో ఫుట్‌ఫాత్‌పై నివాసం ఉంటున్నాడు. కాగా అదే ప్రాంతానికిచెందిన విజయ్, ఫారుఖ్‌లు స్నేహితులు, 2022లో వారిద్దరి మధ్య గొడవలు జరగగా విజయ్ కత్తితో ఫారుఖ్‌ను పొడవడంతో, ఫారుఖ్ ఫిర్యాదుమేరకు విజయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ఫారుఖ్ తీగల నుండి మన్సూరాబాద్‌కు మకాం మార్చాడు. మూడు నెలలు జైలు శిక్ష అనుభవించిన విజయ్ జైలునుండి బయటకు వచ్చాడు. దీంతో ఫారుఖ్ విజయ్‌కు ఫోన్ చేసి చంపేస్తానని బెదిరించాడు. తన అన్న రాజును కొట్టాడాన్ని, తనని చంపుతానని బెదిరిస్తున్నాడని విజయ్ మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు కేసు నమోదు చేసారు.

కాగా గర్బవతి అయిన విజయ్ భార్య విజయభవానికి ఫారుఖ్ ఫోన్ చేసి బెదిరించాడని, అయితే పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫారుఖ్‌ను అరెస్టు చేయడం లేదని విజయ్ తన భార్యా పిల్లలతో కలిసి ఆగస్టు 1వ తేదీ మంగళవారం రాత్రి సమయంలో పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చిన విజయ్ తనతోపాటు తెచ్చుకున్న పెట్రోల్‌ను పోలీస్ స్టేషన్ ఎదుట తన ఒంటిపై పోసుకుని నిప్పు పెట్టుకోవడంతో విజయ్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన విషయం విదితమే. కాగా విజయ్ చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యాఖ్యానబ్రహ్మ లంకా లక్ష్మినారాయణ

చిక్కడపల్లి, ఆగస్టు 9ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమి, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ మహోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక శిఖర డాక్టర్ లంక లక్ష్మినారాయణకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, సినీ నేపథ్యగాయకుడు చంద్రతేజ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ లోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. నవరస గాయనీ ఆమనీ, స్వర కళ్యాణీ, నర్మద, ఆది నారాయణ అద్భుతంగా గానం చేశారు.


## పథకాల అమలుపై అధికారులతో సమావేశం



అధికారులతో సమావేశమైన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త : సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో వివిధ పథకాలు అమలు తీరుతెన్నులపై రెవెన్యూ అధికారులతో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్దిదారుల ఎంపికలో పారదర్శక విధానాన్ని ప్రభుత్వం పాటిస్తోందని, ఎవరైనా డబ్బులు వసూల్ చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసాలతో పేదలకు ఉపకరించే సంక్షేమ కార్యాక్రమాలు అమలు జరుపుతోందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉందన్నారు. అంబర్‌నగర్‌లో ఇండ్ల స్థలాలు క్రమబద్ధీకరణతో సాటు రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఈ కార్యాక్రమంలో ముషీ రాబాద్, మారేడ్‌పల్లి తహసీల్దార్‌లు సద్మా సుందరి, వెంకటలక్ష్మీ, కార్పొరేటర్‌లు సామలహేమ, సునీత, ప్రసన్నలక్ష్మీ, శైలజ, నేతలు కిషోర్ కుమార్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు బెల్టుల ప్రదానం



కరాటే విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బెల్టులు అందజేసి, అభినందిస్తున్న షాడోస్ కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ మురళీకృష్ణంరాజు

నార్సింగి, ఆగస్టు 9 ప్రభాతవార్త : కుంగ్-ఫూ కరాటే విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు షాడోస్ కుంగ్-ఫూ కరాటే గ్రాండ్ మాస్టర్ పూసపాటి మురళీకృష్ణంరాజు బెల్టులు ప్రదానం చేసి అభినందించారు. బుధవారం గండిపేట మండలంలోని హైదర్షాకోట్‌లో ఉన్న కరాటే మైదానంలో 15.గురికి ఎల్లో బెల్టులు, 5.గురికి ఆరెంజ్, 7.గురికి గ్రీన్, 5.గురికి బ్లూ, 6.గురికి మెరూన్, 2.గురికి పర్పుల్, 3.రికి బ్రౌన్, 6.గురికి బ్లాక్ బెల్టులను షాడోస్ కుంగ్ ఫూ కరాటే అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సానం కిషోర్ కుమార్ చేతులపై ఇప్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవడం అత్యవసరమన్నారు. ముఖ్యంగా బాలికలు, యువతులకు ఈ విద్య చాలా ఉపకరిస్తుందన్నారు. అత్యవసర సమయంలో కాళ్లు చేతులనే ఆయుధాలుగా చేసుకొని ప్రత్యర్థుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. కరాటే నిత్య సాధన చేయడం వలన ఎదిగే వయసులోని పిల్లలు చురుగ్గా, సంపూర్ణ ఆరోగ్యంగా తయారవుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రాజకీయంగా మార్పు రావాలని కోరుకున్న గద్దర్

**శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్**



గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, జూలూరి గౌరీశంకర్, దేవీప్రసాద్‌రావు, కళావిఎస్.జనార్ధనమూర్తి

చిక్కడపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త: ఈ తెలంగాణ ఇలా కాదు ఉండాల్సింది, ఈ ప్రాంతంలో మార్పు రావాలి, రావడానికి రాజకీయ పక్షం కావాలని ఆలోచన చేసిన వ్యక్తి ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన ప్రజాయుద్దసౌక గద్దర్ సంస్మరణ సభ జరిగింది. గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ గద్దర్ పైవిధంగా ఆలోచనలు ఉన్న వ్యక్తి సాహిత్యాన్ని ప్రేమిస్తున్నాడా, సామాన్యులను ప్రేమిస్తున్నాడా, రాష్ట్రాన్ని ప్రేమిస్తున్నాడా, రాజకీయాలను చూసి అసహ్యించుకుంటున్నాడా, ఇతని ఆలోచన విస్తృతి ఇంత పెద్దదిగా ఉండడమేమిటి అంశంపై ఆందోళన కలిగిందన్నారు. గొప్ప మానవుడు గద్దర్ అని అన్నారు. గద్దర్ అనే వ్యక్తి పుట్టి పాటకు పట్టాభిషేకం చేసి సంగీతానికి సామ్రాజ్యం ఇచ్చి సామాన్యులకు కిరీటం పెట్టి అభ్బుతమైన జీవితానికి వీలుంటుందన్న సూచన చేసిన మహానుభావుడు గద్దర్ అని అన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ పాటతో ప్రపంచాన్ని జయించాడని అన్నారు. మానవ హృదయాలను జయించారని, తన భావజాలం నక్సలైట్ దగ్గరి నుంచి దళిత ఉద్దరణ మీదుగా సమాజ శ్రేయస్సు కోరుతూ జనమంతా భాగుండాలనే దశకు వచ్చి ప్రపంచ మానవుడే అభ్యుదయ పరిణామానికి కారణమయ్యే పరిస్థితి రావాలని ఆసక్తిని చూపించే దశకు వచ్చారన్నారు. గద్దర్ తన పాట ద్వారా ఆవేశం తెస్తారు, ఆలోచన తెస్తాడని, పాటతో కోపం తెప్పిస్తాడు, పాటవింటే మనమంతా పరవశించేలా చేస్తారని, అన్నింటితో గొప్ప అభివ్యక్తి రచన ఉండేలా చేస్తాడన్నారు. ఆయన రచనలో భావజాలం ఉంటుందని, ఆ భావజాలం చెప్పడంతో అందం ఉంటుందని, భావజాలంలో అందం లేకపోతే చెప్పడంలో ఆకర్షించదని, గద్దర్ ఆకర్షించేంత అద్భుతంగా రాసినటువంటి పాటలు చాలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రఫుల్‌రాంరెడ్డి, పాత శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వారంరోజుల్లో విచారణ జరిపి అర్హులైన లబ్దిదారుల జాబితాను రూపొందించాలి

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



ప్రసంగిస్తున్న మంత్రి తలసాని, చిత్రంలో హోంమంత్రి మహమూద్ ఆలీ

హైదరాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త: కులవృత్తిదారులు మరింత అభివృద్ధి సాధించాలనే సదుద్దేశ్యంతోనే ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించేకార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సహాయం పంపిణీపై హోంమంత్రి మహమూద్ ఆలీతో కలిసి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, మౌజంఖాన్, కౌసర్ మోయినోద్దీన్, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోజ్, బీసీ కార్పొరేషన్ అధికారి ఆశన్న, జిహెచ్ఎంసి ప్రాజెక్టు అధికారి సౌజన్య తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ వారం రోజులలో విచారణ జరిపి అర్హులైన లబ్దిదారుల జాబితాను రూపొందించి అందించాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా నాయీబ్రాహ్మణులు, రజకులు, కుమ్మరి, కంసలి, కంచర, వడ్రంగి, పూసల, మేదర, వడ్డెర, ఆరేకటిక, మేర తదితర కులవృత్తులకు అర్హులైన ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ముందు ఒకోక నియోజకవర్గం పరిధిలో 300 మందికి లబ్ది చేకూర్చనున్నట్లు వివరించారు. ఒకేసారి కాకుండా దశలవారీగా లబ్దిదారులకు గుర్తించి ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు.

## శాంతి భద్రతలు, నేరాల అదుపులో సీసీ కెమరాలు ఎంతో అవసరం : మంత్రి

**కంటోన్మెంట్..** శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో సీసీ కెమరాల ఏర్పాటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని రాష్ట్ర పశుసంవర్థక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సనత్ నగర్ నియోజక వర్గం పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నూతన సీసీ కెమరాల ఏర్పాటుపై పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ సీసీ కెమరాల ఏర్పాటులో దేశంలోనే హైదరాబాద్ నగరం ప్రధమ స్థానంలో ఉందన్నారు. సనత్ నగర్ అసెంబ్లీ పరిధిలో 100 శాతం సీసీ కెమరాల ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. నియోజ కవర్గ అభివృద్ధి నిధులలో అత్యధిక శాతం సీసీ కెమరాల ఏర్పాటుకే కెటాయించినట్లు తెలిపారు. గత సంవత్సరం రూ.84 లక్షల వ్యయంతో సీసీ కెమరాలు కెటాయించగా, ఈ సంవత్సరం 50 లక్షల వ్యయంతో కెటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ దాతల సహ కారంతో కెమరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తర మండలం డిసిపి చందనా దీప్తి, ఏసీపీలు రవిందర్ యాదవ్, రామలింగరాజు, చంద్రశేఖర్, రవికుమార్, సిఐలు రామ్‌ప్ర సాద్, పరశరామ్, రవిలు పాల్గొన్నారు.


## ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాల మహానాడు కార్యకర్తలు

సైఫాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త: ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పైన ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆనేక మంది మాల మహానాడు కార్యకర్తలు బుధవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. జాతీయ మాల మహానాడు కమిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు ప్రజా గాయకుడు గద్ధర్ అమర్‌హై, ట్యాంక్‌బండ్‌పైన గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ కార్యదర్శి భైరీ రమేష్, ఉపాధ్యక్షుడు దార సత్యం తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి దశ, మలి దశ ఉద్యమంలో గద్దర్ కీలకపాత్రను పోషించారని, తాడిత, పీడిత వర్గాల కోసం ఆనేక పాటలుపాడి, ఆటలు ఆడి తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. అభినవ అంబేద్కర్ అయిన గద్ధర్ పేరిట ఒక మ్యూజియంను ఏర్పాటు చేయాలని, ఒక విశ్వవిద్యాలయంకు, ఒక జిల్లాకు పేరు పెట్టాలని, అలాగే సాంస్కృతి సారధి సంస్థకు కూడా గద్ధర్ పేరును నామకరణం చేయాలని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, ప్రతి ఏడాది ఆయన పేరిటి ప్రభుత్వం అవార్డులను ప్రకటించి ప్రదాన చేయాలని వారు డిమాండ్ చేశారు. పై డిమాండ్లను ప్రభుత్వం అమలు చేసేంతవరకు మాల మహానాడు ఉద్యమిస్తుందని వారు హెచ్చరించారు.

## టిటిడి ఆధ్వర్యంలో నీతి కథల పోటీలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న విజయలక్ష్మి

సైఫాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి), హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం లిబర్టి వద్దగల తిరునిలయంలో 'కథ చెబుతారా ఓ కొడతాం' నీతి కథల పోటీలు జరిగాయి. జూనియర్ విభాగం 5 నుంచి 10 సంవత్సరాలలోపు వయసు గలిగిన 36 మంది విద్యార్థులు, సీనియర్ విభాగం 10 నుంచి 15 లోపు విదార్థులు 41 మంది పాల్గొనడం జరిగింది. సీనియర్స్‌లో విద్యా భారతి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కృత్తికకు ప్రథమ బహుమతి, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎ.ఫణిశ్రీకి ద్వితీయ బహుమతి, విద్యా భారతి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న పి.రక్షితకు తృతీయ బహుమతి లభించింది. జూనియర్స్ విభాగంలో హిందూ పబ్లిక్ స్కూల్‌లో యూకేజి చదువుతున్న కె.జ్ఞానవేద, హిందూ పబ్లిక్ స్కూల్‌లోనే 5వ తరగతి చదువుతున్న కె.నేహనందినికి ద్వితీయ బహుమతి, రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న టి.జయశ్రీకి తృతీయ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో హరినాథ్, టి.సురేందర్, కర్రహరలాల్, ధనలక్ష్మి, మాధురి తదితరుల పాల్గొన్నారు.



దళిత యువకుడు విజయ్ సోలంకి మరణానికి కారకులైన మజ్లీస్ నాయకులను అరెస్ట్ చేయాలని కోరుతూ మలక్‌పేట్ పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న బిజెపి దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొప్పు బాష,ఉపాధ్యక్షులు ఓప్రకాష్‌బిస్వా, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు సురేందర్‌రెడ్డి,క్రాంతికిరణ్,అంబేద్కర్,రాజేష్,రాజేందర్, ఎస్సీమోర్చ కార్యకర్తలు పాల్గొన్నారు

## మత్స్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి న్యాయం చేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ధర్నాచౌక్, ఆగస్టు 9, ప్రభాతవార్త: మత్స్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసి వారికి న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం ఇంది రాపార్కు ధర్నాచౌక్‌లో ఫిషరీస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో మత్స్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ గత వారం రోజులుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవటం విచారకరమని అన్నారు. మత్స్యశాక కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ మాట్లా డుతూ తమను పర్మినెంట్ చేస్తారనే ఆశతో గత 2017 నుండి చాలీ చాలని వేతనాలతో మత్స శాఖలో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటి వరకు తమ సమస్యను పరిష్కరించకపోవటంతో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిరణ్, కార్యదర్శి ఏసుదాసు, వివిధ జిల్లాల నుండి తరలి వచ్చిన మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : శ్రీగణేష్, గజ్జెల



1వ వార్డు బాపూజీ నగర్‌లో అన్నదానం చేస్తున్న కంటోన్మెంట్ నాయకులు శ్రీగణేష్, గజ్జెల నాగేశ్, జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, ఆగస్టు9 ప్రభాతవార్త: అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని, అందు వల్ల అకలి మంటలతో అలమటిస్తున్న పేద ప్రజలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు ముందుకు రావాలని కంటోనె మ్మంట్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ నాయకులు ఎన్. శ్రీగణేష్, మన్నెక్రిషాంక్,గజ్జెల నాగేశ్, జంపనప్రతాప్‌లు తెలిపారు. 1వ వార్డు బాపూజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ ముత్యాలమ్మ దేవాలయం 22వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు దుర్గయ్య, అజిత్ కళ్యాణ్, శ్రీకాంత్, ప్రేమ్ ముదిరాజ్, శంకర్, ఆలయ పూజారి, సంతోష్ వర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బిఆర్ఎస్ నాయకులు శరత్, గౌతమ్,రాజు గౌడ్, బిక్షపతి, విష్ణు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలి

**కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్**



బండ్లగూడ కార్పోరేషన్‌లోని ఒకటో వార్డులో జరిగిన ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ చంద్రశేఖర్

నార్సింగి, ఆగస్టు 9 ప్రభాతవార్త : 18.సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ విధిగా ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని బండ్లగూడ జాగీర్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఒకటో వార్డులోని విద్యానగర్ వద్ద రెవెన్యూ అధికారులు ఓటరు నమోదు కేంద్రంను ఏర్పాటు చేసి, యువతీ యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ఈ కేంద్రానికి వచ్చి తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ మన పాలకులను మనమే ఎంపిక చేసుకునే హక్కును రాజ్యాంగం మనకు కల్పించిందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పుడు ఓటు హక్కును నమోదు చేయించుకున్న యువతీ, యువకులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభిస్తుందన్నారు. కొత్తగా ఓటు నమోదు చేయించుకునే వాళ్లు జనన దృవీకరణ పత్రం/ ఆధార్ కార్డు/పదో తరగతి మార్కుల మెమోను తీసుకెళితే సరిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ శంకరయ్య, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, డిఇఒ జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల నిరసనలే ప్రైవేటీకరణను ఆపుతున్నాయి

**పవర్ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు**




మింట్‌కాంపౌండ్ నిరసనలో రత్నాకర్‌రావు, శ్రీధర్, వెంకన్నగౌడ్, ఈశ్వర్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 9,ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన కార్యక్రమాలే విద్యుత్ ప్రైవేటీకరణను ఆపాయని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు అన్నారు. ఈమేరకు బుధవారం యాంటీ ప్రైవేటైజేషన్ డే పురస్కరించుకుని ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్ లోని టిఎస్ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా రత్నాకర్‌రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎంతోపోరాటం చేశారన్నారు. కోచైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ బిల్లు ఆపకపోతే ఉద్యోగ భద్రత ఉండదని ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఎప్పటికప్పుడు వ్యతిరేకించాలన్నారు. విద్యుత్ సరవణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా ఆపాలంటే ఉద్యమాలే శరణ్యం అన్నారు. రెండుగంటలపాటు జరిగిన ఈనిరసన కార్యాక్రమంలో సుమారు 300మంది ఉద్యోగులకు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కోకన్వీనర్ బిసిరెడ్డి, వరపప్రాద్, వెంకన్నగౌడ్, సుధాకర్‌రెడ్డి, రాంజీ, ఈశ్వర్‌గౌడ్, జ్యోతి రాణి, నెహ్రూ, వెంకటనారాయణరెడ్డి, పి.సదానందం, శ్రీనివాస్, కె.కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, జనప్రియ, భాగయ్య, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 13న శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హైదరాబాద్, ఆగస్టు 9,ప్రభాతవార్త: ఆగస్టు 13న (ఆదివారం)శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు-ప్రోత్సహకాలు అందజేయనున్నట్లు ఎస్‌విఎస్ ట్రస్ట్ చైర్మన్ కండ్లకుంట యాదగిరాచార్యులు, శ్రీవైష్ణవ సంఘం తెలంగాణ అధ్యక్షులు శ్రీభాష్యం యదుమోహన్‌లు ఓప్రకటనలో తెలిపారు. ఎల్బీనగర్ చంద్రపురి కాలనీరోడ్ -5లోని శ్రీవైష్ణవ సదనంలో ఉదయం 10.30లకు ఈకార్యక్రమం జరుగుతుందని దీనికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి రమణాచారి హాజరవుతారని విశిష్ట అతిథిగా నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ డా.సముద్రాల వేణుగోపాలచార్యులు, ఆత్మీయ అతిథులుగా ఎమ్మెల్సీ సురభీ వాణిదేవి, ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. టెన్త్,ఇంటర్, జేఈఈ, నీట్ వంటి పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు కండ్లకుంట అత్తుళ్లాయమ్మ స్మారక విశిష్ట విద్యార్థి పురస్కారం అందించడంతోపాటు ఆర్థికంగా వెనబడిన విద్యార్థులకు ఆర్థిక సహకారం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రముఖ్య సాహితీవేత్త డా.ఎస్ శ్రీరంగాచార్యులు, నిమ్స్ న్యూరోసర్జన్ డా.ఎం.విజయసారథికి, డిఆర్‌డివో డైరెక్టర్ శ్రీనివాసచార్యులకు విశిష్ట వ్యక్తి పురస్కారాలు అందజేయనున్నారు. అంతేకాకుండా కందాళ విజయలక్ష్మీ స్మారక విశిష్ట మహిళా పురస్కారం నృత్యకళకారాణి డా.కె గౌతమి, గాయని ఎ.కల్యాణిలకు అందజేయనున్నట్లు తెలిపారు. కొండపాక రంగాచార్య దేశికోత్తమ పుస్కారం డా.కాందూరి వెంగళాచార్యులు, గోవర్ధనం దేశికాచార్య స్మారక పురస్కారం కౌండిన్య తిలక్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కావున ఈకార్యక్రమానికి శ్రీవైష్ణవులందరూ పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపనిచ్చారు.

## సిఎం కెసిఆర్ అన్ని మతాలను గౌరవిస్తున్నారు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో అని న్న మతాలు, కులాలకు సమ న్యాయం లభిస్తున్నదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం గోల్నాకలోని హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చ్ 31వ వార్షికోత్సవం హైటెక్ గార్డెన్‌లో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా చర్చి ఫాదర్ ప్రజలకు సేవలు అందించడం గొప్ప విశేషమని అభినందించారు. సిఎం కెసిఆర్ ఇటీవల 'కెసిఆర్ కానుక' ద్వారా 21 నుంచి 55 సంవత్సరాలు వయసు కలిగిన క్రైస్తవ సోదరిమణులకు ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

నార్సింగి, ఆగస్టు 9 ప్రభాతవార్త : విద్యుత్ లైన్ల మధ్య మరమ్మత్తుల కారణంగా నేడు ఈ క్రింది ప్రాంతాలలో విదునయత్ సరఫరాను నిలిపివేస్తున్నామని హిమాయత్ సాగర్ ఎఇ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు 11.కేవీ విద్యాపీఠం పీడర్, 33/11 కేవీ కిస్మత్‌పూర్ సబ్ స్టేషన్ పరిధుల్లోని సర్వతీ విద్యాపీఠం, భవాని కాలనీ, సిరి ఎన్‌క్లేవ్, శ్రీనివాసం ఎన్‌క్లేవ్, ధాత్రి లేఔట్, ఆనంద్‌నగర్ కాలనీ, కృష్ణానగర్, శివాజీ యూత్ బిల్డింగ్, బండ్లగూడ జాగీర్, పోచమ్మ దేవాలయం, వికాస్‌నగర్ ప్రాంతాలలో అలాగే మధ్యాహ్నం 2.గంటల నుంచి సాయంత్రం 6.గంటల వరకు 11.కేవీ కాళిమందిర్ పీడర్, 33/11కేవీ గంధంగూడ సబ్‌స్టేషన్ల పరిధుల్లోని పీరం చెరువు గ్రామం, శివసాయి నగర్, బైరాగిగూడ, శివపురి, రామ్‌రెడ్డి వెంచర్, గంధంగూడ, భవాని కాలనీ, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాలలో కరెంటు సరఫరా ఉండదని ప్రకటించారు. ఇందుకు వినియోగదారులంతా సహకరించాలని ఎఇ శ్రీనివాస్ తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎర్రదొడ్డి భాస్కర్‌రెడ్డి



భాస్కర్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న వెంకట సుబ్బారెడ్డి

మూసాపేట, ఆగస్టు 9, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శిగా వివేకానందనగర్ డివిజన్ సప్తగిరి కాలనీకి చెందిన సీనియర్ నేత ఎర్రదొడ్డి భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఓసి సంఘం జాతీయ అధ్యక్షులు కందనూరు వెంకట సుబ్బారెడ్డి చేతుల మీదుగా బుధవారం భాస్కర్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని ఓసిల్లో ఉన్న పేదల అభ్యున్నతికి పాటుపడతానని అన్నారు. అందరిని కలుపుకొని పని చేస్తానని ఓసిల హక్కుల కోసం పోరాడుతానని స్పష్టం చేశారు. తెలంగాణాలో ఈ పదవి తనకు అప్పజెప్పినందుకు కందనూరు వెంకట సుబ్బారెడ్డికి, సహకరించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహాపడావ్‌కు వేలాదిగా తరలిరావాలి

**ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్**

నిజాంపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని కార్మిక సంఘాలు ఐక్యతగా నిర్వహిస్తున్న మహా పడావ్ కార్యక్రమం ముగింపు రోజైన గురువారం నాడు ఇందిరాపార్క్ వద్దకు కార్మికులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అనేక త్యాగాలు, రక్తతర్పణలతో పోరాటి తెచ్చుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన ప్రధాని వెంటనే నాలుగు కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుటు ఆశియాదయ్య, భాగ్యమ్మ, నర్సమ్మ, అమృతమ్మ, లక్ష్మీ, యాదయ్య, సత్తమ్మ, పుషమ్మ, ముత్తయ్య, నాగమణి, లలిత, కృష్ణ, యాకయ్య, శ్రీను, జితేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారామే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వివేకానంద్ పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమసంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయన కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తమతమ కాలనీల్లో ఎటువంటి సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకువస్తే త్వరితంగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంక్షేమసంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్**




మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్

చార్మినార్, ఆగష్టు 9 ప్రభాతవార్త : యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం ఛత్రినాక డివిజన్ ఏసిపి రమేష్ ఆధ్వర్యంలో శాలిబండా పోలీస్టేషన్ పరిధిలో గల క్రిష్టల్ ప్యాలెస్‌లో గ్యాన్ కాలెజి విద్యార్థులకు (నషా ముక్త్ హైదరాబాద్) మాదకద్రవ్యాలు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడకం వల్ల జీవితాలు కోల్పోతాయని అన్నారు. ఎవరైన మత్తు పదార్థాలకు అలవాటు పడితే, వాడినా పోలీసులకు, 100 డయల్‌కు సమాచారం ఇవ్వాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. విద్యార్థులు బుద్ధిగా చదువుకొని తమ కర్తవ్యాలను నెరవేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాలిబండా ఇన్స్‌స్పెక్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 13 నుండి కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పాదయాత్ర



కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 9, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఈనెల 13వ తేదీ నుండి జనసేన ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర జనసేన ఇంచార్జ్ నేమూరి శంకర్‌గౌడ్ తెలియజేశారు. బుధవారం కెపిహెచ్‌బి కాలనీలో జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్ బోయిన్‌పల్లి బస్‌స్టాప్ నుండి ఆగస్ట్ 13 ఆదివారం ఉదయం 9.30గంటలకు ప్రజా సమస్యలపై పాదయాత్ర ప్రారంభం కానుందని తెలియజేశారు. ఈ పాదయాత్ర కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో దశలవారిగా జరుగుతుందని, తెలంగాణ రాష్ట్ర జన సైనికులకు, వీర మహిళలకు, పవన్ కళ్యాణ్ అభిమానులకు సూచించారు. ఈ సందర్భంగా నేమూరి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, జనసేన పార్టీకి ఓట్లు వేసి గెలిపించమని ప్రజలను కోరి తప్పకుండా ప్రజల ప్రక్షాన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, జన సైనికులు, వీర మహిళలు అండగా ఉంటారని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ 116 డివిజన్ కమిటీ ప్రెసిడెంట్‌గా గణేష్, వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణ, జనరల్ సెక్రెటరీగా రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాయిరాం, గోవిందరావు, విజయలను నియమించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కోఆర్డినేటర్ కొల్లా శంకర్, నాగేంద్ర, వేముల మహేష్, వెంకటేశ్వరరావు, తుమ్మల మోహన్ కుమార్, కిషోర్, నాగరాజు, డివిజన్ ప్రెసిడెంట్లు, జన సైనికులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులు గృహలక్ష్మీ పథకం కొరకు దరఖాస్తు చేసుకోండి : ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 9, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఇల్లు లేని నిరుపేదల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించినటువంటి గృహలక్ష్మీ పథకం కొరకు అర్హులైన వారి నుండి దరఖాస్తులను మండల తహసీల్దార్ కార్యాలయంలో గానీ, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్వీకరించడం జరుగుతుందని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఇట్టి దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోపు మాత్రమే ఇవ్వగలరని అభ్యర్థించారు. దరకాస్తుతో పాటు రెండు పాస్‌ఫోటోలు, ఆహార భద్రత కార్డు, ఓటర్ కార్డు, ఆధార్‌కార్డ్, ఇంటి స్థలం యొక్క దస్తావేసులు, ఇంటి పన్ను రసీదు, కరెంట్ బిల్లు రసీదు, బ్యాంక్ బుక్ జిరాక్స్ మొదలైనవి జత చేసి ఇవ్వవలసిందిగా తెలిపారు. అర్హులైన వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించినట్యువంటి గృహలక్ష్మీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఎన్నికల ప్రక్రియపై అవగాహన సదస్సు




సమావేశంలో తహసీల్దార్ సుచరిత, కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్, ఆగస్టు 9 ప్రభాతవార్త: దుండిగల్ పురపాలిక సంఘం సమావేశ మందిరంలో బుధవారం కమీషనర్ సత్యనారాయణరావు, తహసీల్దార్ డి.సుచరిత అధ్యక్షతన ఎన్నికల నమోదు ప్రక్రియపై సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు సభ్యులతో సమావేశమైన ఫామ్-6 ద్వారా నూతన ఓటరు నమోదు, ఫామ్-7 ద్వారా ఓటరు తొలగింపులు, ఫామ్-8 ద్వారా సవరణలు, 8ఏ ద్వారా నియోజకవర్గం నుండి మరో నియోజకవర్గంకు మార్పులు చేర్పులపై అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ ద్వారా స్వయంగా ఓటర్ నమోదు గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈనెల 21 నుండి సెప్టెంబర్ 19వరకు నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టుటకు ఎన్నికల్ కమీషన్ అనుమతించినందున ఈవ్యవధిలో ఓటరు నమోదు ప్రక్రియ, పోలీంగ్ స్టేషన్ల గుర్తింపు, సౌకర్యాల కల్పన చేపట్టాలన్నారు. వారం రోజుల లోపల మున్సిపల్ పరిధిలో 0-23 సంవత్సరాల వయసు మధ్యలో ఉన్న అనాథాలను గుర్తించి ప్రభుత్వానికి నివేధించాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, ఆర్‌వో సునంద, సూపర్‌వైజర్లు, బిఎల్‌వోలు, రెవిన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీనగర్ డివిజన్‌లో సీవరేజ్ పనుల ఆధునీకరణ

**కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీ

చిక్కడపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో సీవరేజ్ పనులను ఆధునీకరించబోతున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ వివరించారు. బుధవారం డివిజన్‌లోని సబర్మతినగర్ బస్తీలో కొన్నేళ్ళుగా నిర్మించిన డ్రైనేజీ మ్యాన్‌హోల్ శిథిలావస్తకు కూలిపోయి ఉన్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ వాటర్‌బోర్డు మేనేజర్ కృష్ణమోహన్, జగన్, రాములు, బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ కొనసాగుతున్న క్రమబద్ధీకరణ పనులను తిలకించారు. ఈ ప్రాంతంలో అన్ని మ్యాన్‌హోళ్ళను క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. పైప్‌లైన్‌లు దెబ్బతిని ఉంటే వాటిని కూడా సరి చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ సెల్ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేశ్, బిజెపి నేతలు ఆకుల సురేందర్, నర్సింహా, సాయి కుమార్, రెహ్మాత్ ఆలీ, కుమార్, సంతోష్, ఆనంద్‌రావు, ప్రశాంత్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు న్యాయపరమైన హక్కులపై అవగాహన అవసరం



ఆదివాసీలకు న్యాయపరమైన హక్కులను వివరిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి రాధిక జైశ్వాల్

నాంపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త : అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకొని మెట్రోపాలిటన్ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సంస్థ కార్యదర్శి, సీని యర్ సివిల్‌జడ్జి రాధిక జైశ్వాల్ పలు ప్రాంతాల్లోల నివసిస్తున్న ఆదివాసీలకు న్యాయపరమైన హక్కులపై అవగాహన ఎంతో అవసరమని చెబుతూ నల్సా (ఆదివాసి హక్కుల పరిరక్షణ మరియు అమలు) పథకం 2015 గురించి వారికి వివరించారు. అంతేకాకుండా మెట్రోపాలిటన్ న్యాయసేవాధికార సంస్థ పనితీరు, అందించే సేవలను ముఖ్యంగా న్యాయసేవాధికార సంస్థ అర్హులైన మహిళలకు, వృద్ధులకు ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా ఉచిత న్యాయ సలహాలు, న్యాయసేవలు అందిస్తారని, మిగతావారికి 3లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి మాత్రమే ఉచిత న్యాయసేవలు అందజేస్తారని, ఎవరికైనా ఎప్పుడైనా న్యాయపరమైన సలహాలు, సేవలు అవసరమైనప్పుడు వారు సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు. అలాగే కోర్టుల గురించి, కోర్టుల సేవలను గురించి వారికి వివరిస్తూ, వారడిగిన సందేశాలకు రాధిక జైశ్వాల్ జవాబులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీరు అనంతరెడ్డి, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హారీష్‌సింగ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కళ్ల అద్దాలను పంపిణీ చేస్తున్న కార్పోరేటర్ మహేందర్

**ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో**


## ఉచిత కళ్ల అద్దాలు పంపిణీ

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 9, ప్రభాతవార్త : ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోడీ తొమ్మిది ఏళ్ల సుపరిపాలన సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో వివిధ డివిజన్‌లలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్న వారికి బుధవారం మూసాపేట డివిజన్‌లో కార్పొరేటర్ మహేందర్ కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పద్మయ్య, వినోద్, డివిజన్ అధ్యక్షులు మనోహర్, తూము శైలేష్, సాయిరామ్, కిషోర్, బిజెవైఎం నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28న విద్యార్థి గర్జన

నిజాంపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త : నేడు జరగబోయే విద్యార్థి గర్జన సభ అనివార్యకారణల వలన వాయిదా పడినట్లు దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసభను ఈనెల 28న నిర్వహించనున్నామని, విద్యార్థులు గ్రహించి సహకరించాలని కోరారు.

## హిమాయత్‌నగర్ తహాశీల్దార్‌గా డి.సంధ్యారాణి



చిక్కడపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్ తహాశీల్దార్‌డిగా డి.సంద్యా రాణి పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన బదిలీ అయిన విషయం తెలిసిందే. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపధ్యంలో కేంధ్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి తహాశీల్దార్‌లకు హైదరాబాద్ జిల్లాల్లో వివిధ మండలాలకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడంలో పాటు ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు.ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటానని, భూ కబ్జాదారులపై చట్టపరమైన చరర్యలు తీసుకుంటానని, దళారుల చేతిలో మోసపోద్దని ప్రజలను కోరారు.

## విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి



విజేతలకు పతకాలు ప్రదానం చేస్తున్న మహాలక్ష్మీ, నిరంజన్

హైదరాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త: ఇటీవల బెంగుళూరులో జరిగిన 9వ షటోఖాన్ జాతీయ కరాటే పోటీలలో తెలంగాణ రాష్టం నుంచి పాల్గొన్న జివిఆర్ కరాటే అకాడమీ నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొని సీనియర్ బ్లాక్ బెల్ట్ అండర్-18 విభాగంలో యోగిని కటా, కుమతి విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. సీనియర్ బ్లాక్ బెల్ట్ అండర్-17 సంవత్సరాల విభాగంలో గణ సంతోషి ణిరెడ్డి కటా, కుమతి విభాగాల్లో బంగారు పతకాలు, అండర్-14 బాలుర విభాగంలో దుర్గాచరణ్ కటా, కుమతి విభాగాల్లో బంగారు పతకాలను సాధించారు. విజేతలకు బుధవారం అకాడమిలో హిమాయత్‌నగర్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్, నేతాజి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఛైర్మన్ కోట్ల నిరంజన్ పతకాలను, ప్రసంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మీరామన్‌గౌడ్ మాట్లాడుతూ చిన్నారులు బాల్యం నుంచే అన్ని రంగాలలో ప్రావీణ్యం సాధించాలని సూచించారు.

## కమిషనర్ దృష్టికి సమస్యలు



జూబ్లీహిల్స్ వార్డ్ ఆఫీస్‌ను సందర్శించి సమస్యలను తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ ఇతర అధికారులు

ఫిల్మ్‌నగర్, ఆగస్టు 9, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ డివిజన్‌లోని వార్డ్ ఆఫీస్‌ను ఐఏఎస్ అధికారి, జోనల్ కమిషనర్ అయిన వెంకటేష్ దోత్రే, జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, డిప్యూటీ కమీషనర్ వి.ప్రశాంతిలతో తొలిసారిగా బుధవారం సందర్శించారు. జోనల్ కమీషనర్ వార్డ్ ఆఫీస్‌లోని ప్రతీ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన అధికారులతో మాట్లాడి డివిజన్‌లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. వీలైనంత త్వరగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం డిప్యూటీ కమీషనర్ వి.ప్రశాంతిలకు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ వివిధ సమస్యల గురించి జోనల్ కమీషనర్ వెంకటేష్ దోత్రేకి వివరించడం జరిగింది. కమీషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. త్వరలోనే జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్‌లో పాదయాత్ర చేసి సమస్యలను గుర్తించి వెనువెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జీ అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ సంజయ్‌సింగ్, జిహెచ్ఎంసి అధికారులు ఈఈ విజయ్ కుమార్, ఏఈ వెంకటేష్, బిఆర్ఎస్ నాయకులు దీపాదేవి, జ్యోతి, శంకర్, ఎల్లయ్య, ఆంధ్ర శ్రీను, మనోజ్ పాల్గొన్నారు.

# బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త :** బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో రూ.3కోట్ల 97లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎల్‌బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. సుమారు 2 కోట్ల రూపాయల నిధులతో కృష్ణా వాటర్ పైప్ లైన్లు, కోటి 96 లక్షల 80 వేల రూపాయలతో సీ.సీ.రోడ్లు, కమ్యూనిటీ హాలు, పార్క్ కాంపౌండ్ వాల్, చైన్ లింక్ ఫెన్సింగ్ పనులు చేపట్టారు. బృందావన్ మిడోస్ కాలనీ, జక్కిడినగర్ కాలనీ, శ్రీ గాయత్రినగర్ కాలనీ, గాయత్రినగర్ ఫేస్4లలో కృష్ణావాటర్ పైపులైన్ పనులకు శంకుస్థాపన, మారుతినగర్ కాలనీలో సీ.సీ.రోడ్డు శంకుస్థాపన, ఆఫీసర్స్ కాలనీలో 13.60 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన పార్క్ కాంపౌండ్ వాల్ ప్రారంభోత్సవం, కృష్ణా వాటర్ పైప్ లైన్ శంకుస్థాపన, 57.50 లక్షల నిధులతో సాహెబ్‌నగర్ క్రాంతి యువజన సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన, 54 లక్షల రూపాయలతో స్నేహమయినగర్ నందు నూతనంగా నిర్మిస్తున్న సీ.సీ.రోడ్డు పనులకు శంకుస్థాపన, 28.70 లక్షల నిధులతో ఎస్కేడి నగర్ కమ్యూనిటీ హాలు గ్రౌండ్ చుట్టు చైన్ లింకు ఫెన్సింగ్ మరియు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన, 17 లక్షల రూపాయల నిధులతో ఎస్కేడి నగర్ కమ్యూనిటీహాల్ వెనక రోడ్డులో నూతన సీ.సీ.రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, 26 లక్షల నిధులతో శ్రీరాంనగర్ కాలనీలో నూతన సీ.సీ.రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరిగిందన్నారు. చేయాల్సిన పనులు పనులను దశలవారిగా ప్రణాళికబద్ధంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, డివిజన్ భారాస అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కర్నాటి అనిల్‌చౌదరి, పాగుల రాంబాబు, రాచాల రామకృష్ణగౌడ్‌లతో పాటు గాయత్రినగర్ ఫేస్ 4 సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌరిశెట్టి మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బాలాంత్రపు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యజ్ఞమూర్తి రవికిరణ్, సహాయ కార్యదర్శి సాదుల వెంకటేష్, కోశాధికారి లక్కరాజు అర్జున్, నాగలక్ష్మి, ఈసీ సభ్యులు సురభి క్రాంతికుమార్, ఎల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి : మైనంపల్లి



ఉచిత కుట్టుమిషన్ శిక్షణ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరేడ్‌మెట్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. వినాయక్‌నగర్ డివిజన్‌లో బుధవారం దీన్‌దయాల్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మహిళలు ఈ కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ముందడుగు వేయక తప్పదన్నారు. అన్ని రంగాల్లో శిక్షణ తీసుకొని సొంతంగా వారి కాళ్ళపైన నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం పరుశరామ్‌రెడ్డి, పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, జి.ఎన్.వి సతీష్, సూరి, ఫరీద్, పిట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై అక్రమ కేసులు తగదు : కందికంటి

**ఉప్పల్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** టిడిపి అధినేత చంద్రబాబునాయుడుపై ఎపి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం తగదని టిడిపి మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షుడు కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎపి సిఎం జగన్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించిన టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని, అక్రమాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారన్నారు. వైసిపి నేతలు రాళ్లదాడి చేస్తూ చంద్రబాబుపై దాడికి పాల్పడ్డారని విమర్శించారు. టిడిపి అధినేతపై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ వైసిపికి వ్యతిరేకంగా పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు.

## మంచినీటి పైపు లైన్లు పనులు ప్రారంభం : కౌన్సిలర్ కరాడి శ్రీలతఅనిల్‌కుమార్



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శ్రీలతఅనిల్‌కుమార్ తదితరులు

**తుర్కయాంజాల్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఉమర్‌ఖాన్‌గూడ, తదితర కాలనీలలో త్రాగునీటి కష్టాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా పైపులైన్లను కౌన్సిలర్, బిజెపి ఫ్లోర్‌లీడర్ శ్రీలత అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధరామ్‌రెడ్డి, పాలకవర్గం సహకారంతో ఉమర్‌ఖాన్‌గూడలో అనేక కాలనీలకు నీటిఎద్దడి సమస్యను ఏర్పడిందని సమస్యను తీర్చాలని ఉద్దేశంతో నూతనంగా పైపులైన్ల ఏర్పాటు పనులను ప్రారంభించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొకటిగా నెరవేరుస్తూ వార్డులు, కాలనీల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని ఇందుకు ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్జల జంగారెడ్డి, బిక్కుమల్ల వెంకటేష్, గజ్జల సుదర్శన్‌రెడ్డి, గొట్టే యోజిత్, గొట్టే యువాన్, దూల శంకరయ్యగౌడ్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో గురువారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ సాయికిరణ్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ 11 కెవి వెంకటేశ్వర పీడర్ పరిధిలోని అమృత కాలనీ, సెవెన్‌హిల్స్ కాలనీ, పద్మావతికాలనీ, స్వరూప్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే విధంగా శ్రీశ్రీనగర్ పీడర్ పరిధిలోని శ్రీశ్రీనగర్‌కాలనీ, మల్లికార్జున్‌నగర్, ఫ్రెండ్స్ కాలనీ, శేషసాయికాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా




నాలా అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఆగస్టు 9 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్‌లో నాలా పనులను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక కాలనీవాసులు వర్షపు నీరు ఇళ్లలోకి వస్తుందని తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పనులను వేగవంతం చేయించడం జరిగిందన్నారు. కాలనీవాసులు సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తూ ప్రజల సంక్షేమంకోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఎ సూపర్‌వైజర్ ముజీబ్, మల్లేష్, దినేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాలకు గురైన జిల్లెలగూడ చందన చెరువును కాపాడండి: కలెక్టర్‌కు రెడ్డి సంఘం వినతి

**సరూర్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో అక్రమణలకు గురైన చందన చెరువు స్థలాన్ని పరిరక్షించాలని గ్రామ రెడ్డి సంఘం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సప్పిడి జంగారెడ్డిల ఆధ్వర్యంలో కమిటీ కార్యవర్గం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా వారు 33.05 ఎకరాల విస్తీర్ణం గల జిల్లెలగూడ చెరువు స్థలాల కబ్జాల గురించి కలెక్టర్‌కు వివరించారు. చెరువుకు సంబంధించిన స్థలం నుండే బాలాపూర్ చౌరస్తా వైపు వెళ్లడానికి 100 ఫీట్ల ఆర్‌సిఐ రోడ్డును అప్పట్లో ఏర్పాటు చేశారనీ అయితే రహదారి పక్కన ఉన్న చెరువు స్థలాలను ఇటీవల కొందరు రియల్టర్లు చెరువు శిఖం భూమిని ఆక్రమించి డిస్మెంటెల్ మట్టి వేసి చదను చేసి బాహాటంగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చెరువుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి అందులో నిర్మించిన కట్టడాలను కూల్చివేసి, ఏర్పాటు చేసిన అక్రమ వ్యాపారాలను తొలగించాలని కలెక్టర్‌ను కోరారు. కొన్ని కోట్ల విలువైన చెరువు స్థలం కబ్జాకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ వేసి భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రూ. 100కోట్లతో జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి




జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాదితో కలిసి శంకుస్థాపనలు చేసిన మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** జల్‌పల్లి మున్సిపాలిటీ రూపురేఖలనే మార్చివేస్తున్నామనీ.. ఇప్పటి వరకు దాదాపు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు జరిపిస్తున్నామని రాష్ట్ర మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆమె మున్సిపాలిటీలో రూ.3.20 కోట్లతో వివిధ వార్డుల్లో చేపట్టిన సిసి రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలోనే వరుసగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి జల్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధికి అడ్రస్‌గా మారుస్తున్నామన్నారు. ఒక ప్రత్యేక విజన్‌తో మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామనీ, ఇటీవల ప్రకటించిన విధంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన సిఎం కెసిఆర్‌కు సబితారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్‌పర్సన్ ఫర్హానా నాజ్, మాజీ వైస్ ఎంపిపి ఉమర్ బామ్, కౌన్సిలర్లు అహ్మద్ కసాదిలతో పాటు యూసుఫ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు చేయూతను అందిస్తా : ఉప్పల

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** నిరుపేదలకు తాము చేయూతను అందిస్తామని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగాంజిల్లా వనపర్తి గ్రామానికి చెందిన ఉపేందర్ సత్తమ్మల కూతురు పెళ్లికి అవసరమైన పుస్తెమెట్టెలు, గాజులు, దుస్తులను నాగోల్‌లో ఉప్పల క్యాంపు కార్యాలయంలో విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వధువు కుటుంబ సభ్యులు శ్యామ్, సల్వాచారి, శశికాంత్, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



లబ్దిదారులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**హయత్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పేద, మధ్య తరగతి ప్రజలకు వరంలాంటిదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ మర్పల్లి గ్రామానికి చెందిన సిలివేరు మైసమ్మ, పాశం శ్రీవర్ధన్, ఆర్.కె.నగర్‌కు చెందిన బొల్లెడ్ల పద్మలు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. ఆర్థిక పరిస్థితి బాగోలేని వారికుటుంబ సభ్యులు బీఆర్‌ఎస్ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిటీ ప్రధాన కార్యదర్శి పాశం దామోదర్‌కు వివరించారు. ఆయన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పరిస్థితిని వివరించగా... ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వారికి వరుసగా 8500, 54 వేలు, 32 వేల రూపాయలు మంజూరు చేయించారు. ఈ మేరకు చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందించారు.

## జిహెచ్‌ఎంసి కార్మికులను పర్మినెంట్ చేయాలి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** గత 40 సంవత్సరాలుగా జిహెచ్‌ఎంసి పరిధిలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని జిహెచ్ ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ సరూర్ నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ అరుణ కుమారికి వారు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. వారికి కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే వారికి డబల్‌బెడ్‌రూమ్ ఇస్తామని వాగ్దానం చేసి నేటికీ ఇవ్వలేదన్నారు.

## రేపటి నుండి బడంగ్‌పేట్‌లో చండీ రుద్రహోమం

**సరూర్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ఈ నెల 11 నుండి 13 వరకు రెండు రోజుల పాటు బడంగ్‌పేట్ ఎంసిఆర్ కాలనీలోని శ్రీవాణి గాయత్రీ బ్రాహ్మణ భవనంలో శ్రీ చండీ పారాయణ సహిత లక్ష్మీ గణపతి చండీ రుద్ర హోమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వైదిక కార్యక్రమం సేవా సమితి అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. కాగా ఈ హోమానికి సంబంధించిన కరపత్రాన్ని కెఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్‌తో పాటు శ్రీరామచంద్ర మూర్తి, మధుర కామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత ప్రభుత్వాన్ని తరిమికొట్టండి



ఇంటింటి ప్రచారం చేస్తున్న సామ రంగారెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** మోసపూరిత కేసిఆర్ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు తరిమికొడతారని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా బుధవారం గడ్డిఅన్నారం డివిజన్లో సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సాయి గార్డెన్స్ దగ్గర కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించి, కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమం కోసం కేంద్రం అనేక పథకాలు ద్వారా నిధులు పంపిస్తే రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. ప్రజలను చేయడమే అజెండాగా కెసిఆర్ పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. గడ్డి అన్నారం నేతాజీనగర్‌నుండి సాయిగార్డెన్స్ వరకు వరదనీరు వెళ్లేందుకు బాక్స్ టైపు నాలా కోసం ఏడాది క్రిందట కోటి రూపాయల నిధులు మంజూరు చేసి ఎమ్మెల్యే అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారని, ఇప్పటి వరకు నిర్మాణానికి నోచుకోలేదన్నారు. అభివృద్ధి అని చెప్పుకుని తిరిగే ఎమ్మెల్యే నేతాజీనగర్‌లో పర్యటిస్తే తెలుస్తుందన్నారు. యుజిడి పనులు పూర్తి చేయకపోవడంతో సరస్వతినగర్, కృష్ణవేణినగర్, కమలనగర్‌కాలనీల పరిస్థితి దయానియంగా తయారవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి జయప్రకాష్, ఆనంద్, శ్రీధర్‌రెడ్డి, శ్రవణ్‌గౌడ్, రాంరెడ్డి, బండి నిర్మల, లక్ష్మిప్రసాద్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లకు కమీషన్ పెంపుతో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**నాచారం, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ప్రభుత్వం రేషన్ డీలర్ల కమీషన్ పెంచిన సందర్భంగా బుధవారం మల్లాపూర్‌లో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి రేషన్ డీలర్లతో కలిసి వార్డు ఆఫీసు వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పన్నాల మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజల సంక్షేమంకోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు ఎస్వీ శ్రీనివాస్, సీహెచ్. మల్లేష్, భాస్కర్, రాంచదర్, ఎన్.శ్రీను, రామకృష్ణ, ఆర్షద్, ఇస్మాయిల్ ప్రభాకర్, హన్మంత్ నాయక్, అనిల్, మల్లేష్, బీఆర్ఎస్ నాయకులు వీరస్వామి, శ్రవణ్ తధితరులు పాల్గొన్నారు.

## నిరు పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్సీ నారాయణరెడ్డి



లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

**మలక్‌పేట, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేటలోని ఎమ్మెల్సీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ నారాయణరెడ్డి లబ్దిదారులకు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి సిఎం సహాయనిధి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. సిఎం సహాయనిధి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిఎం కెసిఆర్ రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు.

## పార్టీ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తాం. చంద్రమౌళి

**కుషాయిగూడ, ఆగస్టు 9 ప్రభాతవార్త :** పార్టీ తమకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని ఉప్పల్ అసెంబ్లీ బిజెపి మేనిఫెస్టో కమిటీ చైర్మన్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. గత 40సంవత్సరాలుగా పార్టీ అభ్యున్నతి కృషి చేస్తున్న తన సేవలను గుర్తించి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సిఫారసు మేరకు ఉప్పల్ నియోజకవర్గ మేనిఫెస్టో చైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం అధికారిక ఉత్తర్వుల పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకున్న అనుభవాన్ని కృషితో తోడుగట్టి పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు చేస్తానన్నారు. నాకు తగిన పదవి కట్టబెట్టిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపాల పద్మారెడ్డి, రమేష్ యాదవ్, మల్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి దరఖాస్తుదారుల ఆందోళన

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తులు ఏ కార్యాలయంలో తీసుకుంటారో తెలియక దరఖాస్తుదారులు ఆందోళన చెందారు. ఖాళీ స్థలం ఉండి సొంత ఇల్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం ద్వారా 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం పొందేందుకు దరఖాస్తుదారులు మండల రెవెన్యూ, జిహెచ్‌ఎంసి కార్యాలయాల చుట్టూ దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారులు దరఖాస్తులు స్వీకరించడం లేదని తాము దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలో ఏ అధికారి చెప్పడంలేదని పలువురు దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దరఖాస్తులు స్వీకరించాలని తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పడంతో దరఖాస్తుదారులు వాపోయారు. ప్రభుత్వం ప్రకటన చేసి బాధ్యత రహితంగా వ్యవహరిస్తుందని కార్యాలయాల చుట్టూ ఎన్ని రోజులు తిరగాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, వెంటనే దరఖాస్తులు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోపినాయక్ డిమాండ్ చేశారు.

## పోలీసుల వైఫల్యంతోనే విజయ్ ఆత్మహత్య



సుల్తాన్ బజార్ పిఎస్ వద్ద హరిగౌడ్

**సైదాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** పోలీసుల వైఫల్యంతోనే విజయ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ అన్నారు. మలక్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట వారం రోజుల క్రితం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నంచేసిన సోలంకి విజయ్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న హరిగౌడ్‌తో పాటు ఇతర బిజెపి నాయకులు ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని సుల్తాన్ బజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ విజయ్ మృతికి పోలీసులే బాధ్యత వహించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## రూ. 15లక్షలతో యుజిడి పనులు : మైనంపల్లి



యుజిడి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి, ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ కాలనీలో రూ. 15 లక్షలతో యుజిడి పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. కాలనీలలో ఎటువంటి సమస్యలున్నా తమకు తెలియజేయాలని వెంటనే వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, జిఎం సునీల్‌కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్‌నాయుడు, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బద్దం పరశురాంరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, జిఎన్‌వి సతీష్‌కుమార్, శ్రీనివాస్, నిరంజన్, బాబు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి అశ్వినివైష్టవ్‌తో ఎన్వీఎస్ఎస్ భేటి



కేంద్ర మంత్రి అశ్విని వైష్టవ్‌తో బేటి అయిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

**కుషాయిగూడ, ఆగస్టు 9 ప్రభాతవార్త :** కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్టవ్‌తో బుధవారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బేటి అయ్యారు. ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లిలో రైల్వే టెర్మినల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మరో రెండు నెలల్లో పనులు పూర్తి అవుతాయని మంత్రి పేర్కొన్నారని తెలిపారు. చర్లపల్లి టర్మినల్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీ హాజరవుతారని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సికింద్రాబాద్‌నుంచి బెంగుళూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌రైలును పుట్టపర్తిలో ఆపాలని సత్యసాయి భక్తులు కోరుతున్నారని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి అశ్విని వైష్టవ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.


## అధ్వాన్న స్థితిలో ప్రభుత్వ పాఠశాలలు : రాగిడి



ఎంఇఓకు వినతి పత్రం అందజేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ఉప్పల్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు అధ్వాన్నస్థితిలో ఉన్నాయని, పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయం ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అమలు చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో అమలు చేయలేదన్నారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని, గదుల కొరత, ప్రహరిగోడ లేవని, కిచెన్‌షెడ్డు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుందని, డిగ్రీ కళాశాలలో అధనపు గదులు లేక షిఫ్టుల పద్ధతిలో బోధన చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు సదుపాయాలు కల్పించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌శెట్టి, డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, పిసిసి సభ్యులు వినోద్‌ముదిరాజ్, షేక్ మదర్‌వలీ, వంజరి సంతోష్, పలకల నరసింహారెడ్డి, మేడల మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, గణేష్‌నాయక్, భను, లక్ష్మి, నీరజారెడ్డి, భద్రయ్య, సాయిబాబా, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి ఆలయంలో తరుణ్ చుగ్ పూజలు



తరుణ్‌చూగ్‌తో బిజెపి నాయకులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇంచార్జ తరుణ్ చూగ్ ఆర్‌కెపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, రంగ నరసింహగుప్తా, జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టా ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్, గోవర్ధన్‌గౌడ్, అష్టలక్ష్మి దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి ఐత అంజయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మేయర్‌ను, కాంగ్రెస్‌ను విమర్శిస్తే సహించేది లేదు: వంగేటి ప్రభాకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న మేయర్‌ను, సహకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలను విమర్శిస్తే సహించేదిలేదని కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. దావూద్‌ఖాన్‌గూడ భూమి కోసం దళితులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వారికి న్యాయం చేయాల్సింది పోయి మేయర్‌పై, కాంగ్రెస్ పార్టీపై బిఆర్ఎస్, బిజెపి వారు విమర్శలు, ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు బుధవారం మల్లాపూర్ బాలాజీ టౌన్‌షిప్‌లోని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ దళిత సీనియర్ నాయకులు బాల్‌నింగని జంగయ్య, ఎర్ర జైహింద్‌కుమార్, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన అవగాహన రాహిత్యంలోనే బిజెపి, బిఆర్ఎస్ నేతలు అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అభివృద్ధికి సంబంధించి మేయర్ ఒక్కరే నిర్ణయం తీసుకోరనీ ప్రతిపాదిస్తే అన్ని పార్టీల వారు ఉన్న కౌన్సిల్ తీర్మాణం చేస్తుందనే విషయం గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. ప్రభుత్వ కార్యాలయాలు ఉంటే ఇంకా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారనీ అయితే మంత్రి సబితా ఇంద్రారెడ్డి గ్రంథాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో దళితులకు పట్టాలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదో వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ అండగా ఉంటుందనీ అయితే తమను విమర్శించే వారు ఒక సారి ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గట్టు బాలకృష్ణ, కళ్లెం మల్లారెడ్డి, టేకుల సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.